# పదేళ్లలో అద్భుత ప్రగతి



జెండావిష్కరణ చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, పక్కన మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

- అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించాం
- కాంగ్రెస్ ఆరు నెలల పాలనపై తీవ్ర వ్యతిరేకత
- ప్రజలకు అండగా నిలుద్దాం
- హామీల అమలు, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేద్దాం
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లి, జూన్3: తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పదేండ్లలోనే తెలంగాణ అద్భుత ప్రగతి సాధించిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కొనియాడారు. సోమవారం తెలంగాణ దశాబ్ధి ఉత్సవాల ముగింపు వేడుకలను జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా దాసరి మనోహర్‌రెడ్డి జాతీయ జెండాను, అనంతరం బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధితో పాటు భవిష్యత్తు కార్యాచరణపై సమావేశం నిర్వహించి, పలు అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ నాయకుడు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించడమే కాదు పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని ప్రశంసించారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనపై ప్రజల్లో ప్రజావ్యతిరేకత మొదలైందని, ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో రేవంత్ సర్కారు ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ప్రజలకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని, హామీల అమలు, సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌ది వసుదైవక కుటుంబమని, కొంత మంది పార్టీని వీడినా పెద్ద నష్టమేమి లేదన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి రాష్ట్ర సర్కారు ప్రజావ్యతిరేక విధాలను ఎండగట్టాలన్నారు. రానున్న కాలంలో కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికునిలా పని చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు, నాయకులు జడ్పీటీసీలు గంట రాములు, నారాయణ, రఘువీర్ సింగ్, బండారి శ్రీనివాస్, గోపు ఐలయ్య యాదవ్, పీటీ స్వామి, ఉప్పు రాజ్‌కుమార్, మార్కు లక్ష్మణ్, ఉష తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమకారులపై చిన్నచూపు

కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులను చిన్నచూపు చూస్తున్నది. ఆరు నెలల కాలంలోనే ప్రజావిశ్వాసాన్ని కోల్పోయింది. సీఎం రేవంత్‌రెడ్డి ఒంటెత్తు పోకడలను ప్రజలు గమనిస్తున్నరు. సమయం వచ్చిన కర్రుకాల్చి వాత పెడుతరు.

– కోరుకంటి చందర్, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు

### రాబోయే కాలం మనదే

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినం అని బాధపడద్దు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఏమాత్రం భయపడద్దు. మీకు అండగా మేమున్నం. రాబోయే కాలం బీఆర్ఎస్‌దే. మనం ఇంకా బలంగా తయారు కావాలి. కేసీఆర్ నాయకత్వంపై నమ్మకం ఉంచి మరింత ముందుకు సాగాలి.

– దాసరి మనోహర్‌రెడ్డి, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే

### ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులే గెలుస్తరు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం లేదు. మంథని నియోజకవర్గంలో మట్టి, ఇసుక దందా జోరుగా సాగుతున్నది. దీనిని నియంత్రించాల్సిన బాధ్యత ప్రభుత్వం ఉన్నది. మంథనిలో మంత్రి తమ్ముడు పెత్తనం సాగిస్తున్నడు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ధైర్యం కోల్పోవద్దు. అండగా మేమున్నాం. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుదాం. ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీద్దాం. – పుట్ట మధూకర్, పెద్దపల్లి జడ్పీ చైర్మన్

# కౌంటింగ్‌కు పకడ్బందీ బందోబస్తు

- ర్యాలీలు, సభలకు అనుమతి లేదు
- సీపీ అభిషేక్ మొహంతి



రాంనగర్, జూన్ 3: కరీంనగర్ లోక్‌సభ ఓట్ల లెక్కింపు సందర్భంగా పకడ్బందీ పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. ఇద్దరు అడిషనల్ డీసీపీ స్థాయి అధికారులు, 11 మంది ఏసీపీలు, 16 మంది ఇన్‌స్పెక్టర్లు, 39 మంది ఎస్ఐలు, 46 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 220 మంది పోలీస్ కానిస్టేబుళ్లు, 125 మంది హోంగార్డులతోపాటు 8 స్పెషల్ యాక్షన్ టీంలు, 3 ప్లాటూన్ల స్పెషల్ పోలీసులను, టాస్క్ ఫోర్స్ టీంలను కేటాయించినట్లు వివరించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి భద్రతా పరమైన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచే 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎక్కడా ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమిగూడి ఉండవద్దని సూచించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదని, ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ ఒక ప్రకటనలో తెలిపారు.



కరీంనగర్: ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, తదితరులు



రాజన్న సిరిసిల్ల: ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు



జగిత్యాల రూరల్: ఎంసీహెచ్‌లో పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

# దశాబ్ది ఉత్సవం.. బీఆర్ఎస్ సాయం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ముగింపు వేడుకల్లో భాగంగా సోమవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చర్చించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా జాతీయ, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అమరవీరుల స్తూపాల వద్ద నివాళులర్పించారు. అనంతరం సమావేశమై పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో సాధించిన విజయాలు, జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చించారు. తర్వాత ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు, అనాథాశ్రమాల్లో పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. – జగిత్యాల రూరల్ జూన్ 3

# భవిష్యత్ తరాలను కాపాడేది మనమే



జెండావందనం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

- రాష్ట్రానికి మనమే హక్కుదారులం
- అలుపెరుగని కృషి చేసి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది
- త్వరలో బీఆర్ఎస్‌కు మంచి రోజులు
- స్థానిక ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి
- ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, జూన్ 3: ప్రత్యేక రాష్ట్రం కోసం బరిగీసి కొట్లాడి, ఉద్యమించి తెలంగాణను తెచ్చింది మనమేనని కరీంనగర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. 13 ఏండ్లు సుదీర్ఘ పోరాటం చేసి ఉద్యమాన్ని ముందుండి నడిపించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ పేరు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడారు. మన రాష్ట్రానికి హక్కుదారులం మనమేనని, మన భవిష్యత్ తరాలను కాపాడుకునేది మనమేనని తేల్చి చెప్పారు. భూమి ఉన్నంత కాలం బీఆర్ఎస్ ఉంటుందని, ఎవరూ పార్టీని ఖతం చేయలేరన్నారు. త్వరలోనే బీఆర్ఎస్‌కు మంచి రోజులు వస్తాయని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. త్వరలోనే నూతన జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకొని, పార్టీ అనుబంధ సంస్థల కమిటీలు నియమించుకుందామని చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కేసీఆర్ భవన్‌లో సోమవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా జాతీయ జెండాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణరావు, పార్టీ జెండాను బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జీవీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనడం, ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించడంతోపాటు, ఇప్పుడు దశాబ్ది ఉత్సవాల్లో జరుపుకునే అవకాశం మనందరికీ రావడం గర్వంగా ఉందన్నారు. దేశ స్వాతంత్ర పోరాటం తర్వాత జరిగిన గొప్ప ఉద్యమం, తెలంగాణ ఉద్యమమేనని కీర్తించారు. 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..?' అని నినదించి మన కరీంనగర్ నుంచే ఉద్యమాన్ని ప్రారంభించారని, పార్టీ సందర్భంగా తెలంగాణ శంఖారావం, తెలంగాణ దీక్ష జరిగింది మన గడ్డ పైనేనని గుర్తుచేశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా అనేక సంస్కరణలు చేసి దేశంలో వివిధ రాష్ట్రాల ప్రజల దృష్టిని ఆకర్షించారని చెప్పారు. కేసీఆర్ పాలనలో తాను సివిల్ సప్లయ్ మంత్రిగా పనిచేశానని, రైతులు రికార్డు స్థాయిలో 95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించినా కొనుగోలు చేశామని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో రైతులు ఆగమైపోయారని దిగుబడి 45 లక్షల మెట్రిక్ టన్నులకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాసంగి పోయి వానకాలం సీజన్ వచ్చిందని, రైతులకు సకాలంలో జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు, ఎరువులు ఎందుకు పంపిణీ చేయలేకపోతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కరెంట్, నీళ్లకు ప్రజలు గోసపడుతున్నారని, మళ్లీ కేసీఆర్ పాలన ఎదురు చూస్తున్నారని చెప్పారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి కరీంనగర్ ప్రభుత్వ దవాఖానలో పండ్లు పంపిణీ చేశారు.

### మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలి

రాష్ట్ర మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఎప్పుడు ఏం మాట్లాడుతున్నారో వాళ్లకే తెలియడం లేదు. రోడ్లు భవనాల మంత్రి వ్యవసాయం గురించి మాట్లాడుతున్నడు. ఇంకో మంత్రి మరో శాఖ గురించి వివరాలు చెబుతడు. వారి శాఖలు ఏంటో కూడా వారికే తెలువకుండా పోయింది. మంత్రుల వ్యవస్థ అదుపు తప్పింది. అయితే వాళ్లను నియంత్రిస్తే ఎక్కడ తనపై అసమ్మతి తెస్తారో..? అని సీఎం రేవంత్‌రెడ్డి భయపడిపోతున్నడు. కాంగ్రెస్ ఆరు నెలల పాలనలో రాష్ట్రం ఆగమైపోయింది. మళ్లీ 1956 నాటి పరిస్థితులను తీసుకొస్తున్నరు. ప్రజలు, రైతులకు ప్రభుత్వంపై నమ్మకం పోయింది. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉన్నది. అవసరమైతే మరో ఉద్యమానికి సిద్ధంగా ఉండాలి. సమిష్టిగా ఉందాం, సమిష్టిగా కృషి చేద్దాం.

– గంగుల కమలాకర్

### ఆయువుపట్టు కరీంనగర్ గడ్డ

తెలంగాణ ఉద్యమానికి ఆయువుపట్టు కరీంనగర్ గడ్డ. 2009లో దీక్షకు కేసీఆర్ ఇక్కడి నుంచి కదిలినప్పుడు ఇక్కడ ప్రజలు అండగా నిలిచిన్రు. ఉద్యమంతోపాటు ప్రతి ఎన్నికల్లో వెన్నంటే ఉన్నరు. నాడు చంద్రబాబుతో కలిసి తెలంగాణ ఉద్యమానికి ద్రోహం చేసింది రేవంత్‌రెడ్డి. తెలంగా ఉద్యమం, దినోత్సవం, అస్థిత్వంగురించి ఆయనకు తెలియదు. అంపదకే అవరతణ దినోత్సవాన్ని ఒక్కరోజులోనే నిర్వహించి మమ అనిపించిండు. బలిదానాలకు కారణమైన సోనియాగాంధీ వేడుకలకు వస్తే అవమానం జరుగుతుందని రాలేకపోయింది.

–జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు



జగిత్యాల రూరల్: పార్టీ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, నినదిస్తున్న ఎమ్మెల్యే సంజయ్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

# హామీలేమైనయ్?

- కాంగ్రెస్ ఇచ్చినవన్నీ ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలు
- సంక్షేమాన్ని మరిచి గ్రూపురాజకీయాలు
- ప్రభుత్వం ఉంటదో.. ఊడుతదో తెలువదు
- బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కే విద్యాసాగర్‌రావు

జగిత్యాల రూరల్, జూన్ 3: 'గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలు చేసింది. ప్రజలు నమ్మి ఓట్లేసి గెలిపించిన్రు. అధికారం వచ్చింది. మరి ఆ హామీలేమైనయ్? సరిగ్గా ఒక్కటి కూడా అమలు చేయలేదు' అని బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు కే విద్యాసాగర్‌రావు మండిపడ్డారు. కాంగ్రెస్ సంక్షేమాన్ని మరిచిపోయిందని, ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. గ్రూపు రాజకీయాలతో సతమతమైపోతున్నదని, ప్రభుత్వం ఉంటదా..? ఊడుతదా..? తెలియడం లేదన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ధి వేడుకల ముగింపు కార్యక్రమం నిర్వహించగా, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్‌కుమార్, జడ్పీ చైర్మన్ దావ వసంతతో కలిసి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి గులాబీ జెండాను ఎగరేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలోనే బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్సీగా గెలుపొందడం శుభ పరిణామమన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమాన్ని చేపట్టి, 13 ఏండ్లు పోరాడి, దేశంలో 29వ రాష్ట్రంగా తెలంగాణ సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. అధికారం చేపట్టి అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపి దేశం మొత్తం మనవైపు చేసేలా కృషిచేసిన ఘనత కేసీఆర్‌దేనని గుర్తుచేశారు. అనంతరం జగిత్యాల మాతాశిశు దవాఖానలో పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ హరిచరణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

### కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన దేశానికే ఆదర్శం. పదేళ్లలోనే రాష్ట్రాన్ని దేశంలోనే అగ్ర భాగాన నిలిపిండు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లలా బీఆర్ఎస్ పాలన సాగింది. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసం కేసీఆర్ ఎంతగానో కృషి చేసిండు. విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేసిండు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతున్నది. ₹5లక్షల విద్యా భరోసా హామీపై స్పష్టత ఇవ్వాలి.

– డాక్టర్ సంజయ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

# భూ కబ్జా ఘటనలో నలుగురిపై కేసు

### ఒకరు అరెస్ట్

రాంనగర్, జూన్ 3 : కరీంనగర్ తీగలగుట్టపల్లిలోని సర్వే నంబర్ 277లో గల తన ఇంటి స్థలాన్ని కబ్జా చేశారని, అడిగితే చంపుతానని బెదిరింపులకు గురిచేశారని జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం గొడిశాలపేట గ్రామానికి గంగిరెడ్డి భీంరెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ జరిపి నలుగురు నిందితులపై కేసు నమోదు చేశారు. నగరానికి చెందిన గోపడి మాధవ రావు, లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి, లక్కిరెడ్డి సుకన్య, సునీల్ నిందితులుగా ఉండగా, ఇందులో లక్కిరెడ్డి కిరణ్ రెడ్డిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరిచారు. జడ్జి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు.

# అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ



సిరిసిల్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

- కేసీఆర్ సారథ్యంలో పోరాటం చారిత్రాత్మకం
- బీఆర్ఎస్ రాష్ట్రం దేశానికే దిక్సూచిగా నిలిచింది
- అభివృద్ధి, సంక్షేమంలో ముందున్నది
- వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

రాజన్న సిరిసిల్ల, జూన్ 3 (నమస్తే తెలంగాణ): 'ఎందరో అమర వీరుల త్యాగానికి ప్రతిఫలమే తెలంగాణ రాష్ట్రం. కేసీఆర్ సారథ్యంలో జరిగిన రాష్ట్ర సాధన పోరాటం చారిత్రాత్మకం' అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కొనియాడారు. సిరిసిల్ల పట్టణంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. స్వరాష్ట్ర సాధన అనంతరం తొలి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే దిక్సూచిగా నిలిచిందన్నారు. స్వరాష్ట్రం కోసం చేసిన అమర వీరుల త్యాగాలు, తెలంగాణ ప్రజల పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయని చెప్పారు. తొలి దశ తెలంగాణ పోరాటమైనా, మలిదశ తెలంగాణ ఉద్యమమైనా మనకు గుర్తుకు వచ్చేది అమరుల త్యాగమేనన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అంటూ ఉద్యమాన్ని, మలి దశ పోరాటాన్ని కేసీఆర్ ముందుండి నడిపించారని తెలిపారు. అందుకు స్ఫూర్తి మాత్రం అమరుల త్యాగాలే అన్నది అక్షర సత్యమని చెప్పారు. శతాబ్ది కాలంలో జరుగని అభివృద్ధిని బీఆర్ఎస్ దశాబ్దకాలం పాలనలో చేసి చూపించిందన్నారు. పదేండ్లలోనే వ్యవసాయం పండగలా మారిందని, విద్యుత్, విద్యరంగంలో ఆదర్శంగా నిలిచిందని వివరించారు. జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసి వైద్య రంగాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత మన కేసీఆర్‌దేనని కొనియాడారు. ఆనాడు సమైక్య పాలకులు, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఎదురెల్లి పోరాటం చేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదన్నారు. కాళేశ్వరంలో రెండు పిల్లర్లు కుంగితే మరమ్మతులు చేయించకుండా, రైతులకు నీళ్లు ఇవ్వకుండా పొలాలు ఎండబెట్టిన అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. తెలంగాణ కోసం మాట్లాడే హక్కు గులాబీ జెండాకే ఉందని స్పష్టం చేశారు. అంతకుముందు నేతన్న చౌక్‌లోని అమరవీరుల స్తూపం వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘన నివాళులర్పించారు. స్వరాష్ట్ర సాధన కోసం అమరులు చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో పార్టీ జెండాను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ జాతీయ పతాకాలను ఎగురవేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి మ్యాన రవి, ఎండీ సత్తార్, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఉన్నారు.



తెలంగాణ భవన్‌లో జెండాకు వందనం చేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాయకులు గూడూరి ప్రవీణ్, జిందం చక్రపాణి

# భర్త మాట్లాడడం లేదని ఆత్మహత్య

గన్నేరువరం, జూన్ 3: మండల కేంద్రానికి చెందిన పత్తి మమత (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. ఆమె భర్త దుర్గాప్రసాద్ జీవనోపాధి కోసం రెండు నెలల క్రితం జార్ఖండ్‌కు వెళ్లాడు. అప్పటి నుంచి మమత అనేక సార్లు ఫోన్ చేసినా అతడు మాట్లాడకపోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు మృతురాలి తండ్రి జోగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. మమతకు పదేండ్ల కుమారుడు ఉన్నాడు.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక..

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571